క్లుప్తంగా

నేడు బీసీజీ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్



యూపీహెచ్‌సీలో సమావేశమైన వైద్య సిబ్బంది

విశాఖ విద్య : వృద్ధుల్లో టీబీ వ్యాధి నివారణకు చేపట్టే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై బుధవారం యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ వ్యాక్సినేషన్ వేయాల్సి ఉందన్నారు. వృద్ధుల్లో ఎక్కువగా టీబీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నందున, దీనికి అడ్డుకట్ట వేసే క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూపీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది సచివాలయాల పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. లక్ష్యం మేరకు వృద్ధులందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ వేసేలా ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

మంత్రి సీదిరి అప్పలరాజుకు పరామర్శ



అప్పలరాజును పరామర్శిస్తున్న శ్రీధర్, ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య : మంత్రి సీదిరి అప్పలరాజును డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ బుధవారం పరామర్శించారు. అప్పలరాజు కుమారుడు అనారోగ్య సమస్యతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీధర్, అల్ఫా కృష్ణ ఆస్పత్రికి వెళ్లి అప్పలరాజు కుమారుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దివ్యాంగుల బడిబాటకు ప్రత్యేక సర్వే



సర్వే చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్, ఐఈఆర్పీలు

పెదగంట్యాడ: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర జిల్లా సంచాలకుల ఆదేశానుసారం ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్పీలు రవి, జయభారతి తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జూన్ 9 వరకు సర్వే సాగుతుందన్నారు. ఈ సర్వేలో భాగంగా చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారికి చదువు వలన కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాలను వివరించినట్లు చెప్పారు.

అలరించిన మెగా సుస్వరాభిషేకం

సీతంపేట: చిరంజీవి కళా పరిషత్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన మెగా సుస్వరాభిషేకం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలను పాడి అలరించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ కందుల నాగరాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



గుల్లలపాలెం మైదానంలో కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

- వేసవి సెలవులు గడుపుతున్న చిన్నారులు
- ఆటపాటలు.. క్రీడలతో ఒకటే జోష్

ఏడాది అంతా చదువుతో కాలం గడిపిన చిన్నారులు పరీక్షలు పూర్తయి వేసవి సెలవులు రావటంతో ఒకటే సందడి చేస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా ఆటపాటలతో గడుపుతున్నారు. తమకు నచ్చిన అంశంలో తర్ఫీదు పొందుతున్నారు. ఎవరి ఉత్సాహం కొద్దీ వారు కరాటే, బాక్సింగ్, మ్యూజిక్, డ్యాన్స్, వ్యాయామంలో శిక్షణ పొందుతున్నారు. పిల్లల ఉత్సాహాన్ని పెద్దలు కూడా ప్రోత్సహిస్తున్నారు. -మల్కాపురం



జిమ్‌లో వ్యాయామం చేస్తూ..



డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం గ్రామదేవతలు అయిన కుంచుమాంబ.. నీలమాంబ అమ్మవార్ల ఉత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులైన స్థానిక వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవార్ల ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. గురువారం ఉదయం నుండి ముగింపు రోజు వరకు ప్రతి రోజు ప్రత్యేక పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.



కుంచుమాంబ.. నీలమాంబ అమ్మవార్లు

బుద్ధ పూర్ణిమ వేడుకలు నేడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో ఈ నెల 23న బుద్ధ పూర్ణిమ నిర్వహించనున్నామని బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ బోర వేణుగోపాల్ గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొనున్నారన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించనున్నామని, అలాగే బుద్ధ వందనం, దమ్మ సందేశం, దమ్మ దీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం : శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి పిలకవానిపాలెం 11 కేవీ ఫీడర్ వద్ద వార్షిక మరమ్మతుల కారణంగా పిలకవానిపాలెం ఫీడర్ పరిధి పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడిపందాలదిబ్బ, శ్రీనివాస్‌నగర్, గుల్లలపాలెం, రామ్‌నగర్, కుంచుమాంబకాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

గోపాలపట్నం పరిధిలో..

గోపాలపట్నం : నరసింహనగర్ ఫీడర్, పెట్రోల్ బంక్ ఫీడర్, కొత్తపాలెం ఫీడర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, లక్ష్మీనగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, రామకృష్ణానగర్, కొత్తపాలెం, సంతోష్‌నగర్, డీఏఆర్ నగర్, గణపతినగర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ



డ్రాయింగ్స్ చూపిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం డ్రాయింగ్ శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనంలో మెలకువలు, థీమ్ పెయింటింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీ రమణ, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఉక్కునగరం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సెక్టార్-1లో వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన ఆలయ గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

తెలగా సేవా సంఘం అధ్యక్షునిగా రాంబాబు



సమావేశంలో తెలగా సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస : చిట్టివలస తెలగా సేవా సంఘం అధ్యక్షునిగా రంగూరి సీతారామ దొర అలియాస్ రాంబాబును పాలకవర్గం ఎన్నుకుంది. బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యదర్శిగా నార్ల వాసు, సంయుక్త కార్యదర్శిగా తమ్మిన సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. సంఘ ప్రతినిధులు అల్లు బాబూరావు, సుంకర రామ్‌ప్రసాద్, రంగూరి రామ్‌కుమార్, నక్కాన గోవింద్, రంగూరి సాధు సుందర్‌సింగ్, బండారు ఎల్లాజీరావు, రంగూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్లే స్కూళ్లపై చర్యలు కోరుతూ ఫిర్యాదు

గాజువాక : ప్లే స్కూళ్ల ముసుగులో ఎటువంటి అనుమతులు లేకుండా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో పాటు 1, 2, 3 తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వ చర్యలు లేనికారణంగా జిల్లాల్లో పుట్టగొడుగుల్లా ప్రతి వీధిలోను ప్లే స్కూళ్లు పుట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. ప్లే స్కూల్ అంటే ప్రీప్రైమరీ తరగతులను మాత్రమే నిర్వహించాలని, వాటికి కూడా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. కాగా, వీటిపై తక్షణమే చర్యలు చేపడతామని ఆర్జేడీ పేర్కొన్నట్టు అప్సా సంఘం నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పించినవారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, ఫైనాన్స్ కార్యదర్శి పి.భాస్కరరావు, సీనియర్ సభ్యులు ఎం.జనార్ధన్, గణపతిరావు, సత్యం, రామ్మోహన్, సత్యనారాయణ తదితరులున్నారు.



ఆర్జేడీకి వినతిపత్రం సమర్పిస్తున్న అప్సా ప్రతినిధులు

తెలుగు కథలు ఉత్తమం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉత్తమ తెలుగు సాహిత్యం' అనే అంశంపై కథా కచేరీ నిర్వహించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మానవ సంబంధాలు, విలువలు, సామాజిక సమస్యలను పరిష్కరించడానికి, విశ్లేషించడానికి కథలు దోహదపడతాయన్నారు. ఉత్తమమైన విలువల గల మంచి తెలుగు కథలకు తూర్పు దిక్కు ఉత్తరాంధ్ర, తెలుగు కథకుల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి కథలు, కాంతం కథలు, అమరావతి కథలు, రావిశాస్త్రి కథలు, పాలగుమ్మి పద్మరాజు కథలు, కారా కథలు, కొకు కథలు, బలివాడ కాంతారావు కథలు, కవనశర్మ కథలు మొదలైన వాటిని వర్తమాన రచయితలు చదివి స్ఫూర్తి పొందాలన్నారు. ఎస్.విజయకుమార్, రచయితలు కె.జి.వేణు, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కప్పిలి భీమేశ్వరరావు, చిట్టిళ్ల నిర్మలాదేవి కథా పఠనం చేశారు.

వైభవంగా నృసింహ జయంతి

- సింహగిరిపై సాయం సంధ్య వేళ ప్రత్యేక పూజలు
- నృసింహ వనంలో విశేష ఆరాధన

సింహాచలం: నృసింహ జయంతిని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారు ఆవిర్భవించిన సాయం సంధ్య వేళ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా సాయంత్రం 5 గంటలకు దర్శనాలు నిలుపుదల చేసి, ఆలయ సంప్రోక్షణ చేశారు. అనంతరం అంతరాలయంలో స్వామివారి మూలవిరాట్ చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పంచకలశ స్నపనం, అర్చన నిర్వహించారు. అనంతరం క్షేత్రమహాత్మ్యంలో ఉన్న నృసింహ ఆవిర్భావ ఘట్ట పురాణ విన్నపం చేశారు. అనంతరం నమ్మాళ్వార్ తిరునక్షత్ర పూజలు, దివ్యప్రబంధ సేవాకాలం, నివేదన, సీతలోపచారాలు, మంగళాశాసనం, ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



నృసింహవనంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్న గోశాలలో..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో బుధవారం నృసింహ జయంతిని దేవస్థానం వైదిక, అధికార వర్గాలు వైభవంగా నిర్వహించాయి. నృసింహవనంలోని కొండపై వేంచేసిన భారీ నృసింహస్వామి, ప్రహ్లాదుడి విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ

పరవాడ: పరవాడ గ్రామంలో వెలసిన బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారు స్థానికుల పూజలను అందుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు తరలివస్తారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించి, పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో పరవాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వైఎస్సార్‌సీపీ గెలుపు కోరుతూ పూజలు



పెద్దింటమ్మకు పూజలు చేస్తున్న నాయకులు

మల్కాపురం : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, పశ్చిమలో ఆడారి ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుతూ 61వ వార్డుకు చెందిన నాయకులు మల్కాపురంలోని మార్కెట్ వీధిలో గల పెద్దింటమ్మకు పూజలు చేశారు. బుధవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, ట్రేడ్ యూనియన్ నాయకులు బద్రీనాథ్, భోగవల్లి నాగభూషణం, స్థానిక నాయకులు దాడి సత్యనారాయణ, ఎం. అప్పారావు, జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), బూస అప్పలరెడ్డి, మంగ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాలు మెరుగుపరిచారన్నారు. అలాంటి నాయకుడిని గెలిపించుకోవాలన్నారు. అలాగే పశ్చిమలో పేదలకు అండగా, వారి కష్టాల్లో తోడుగా నిలిచిన ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించుకునేందుకు ఓటర్లంతా భారీ ఎత్తున ఆయనకు ఓట్లు వేశారని తెలిపారు. రేపటి ఫలితాలలో ఆనంద్‌కుమార్ చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సృష్టిలో ప్రతి జీవి ముఖ్యమైనదే

మల్కాపురం : ప్రకృతిలో ఉన్న ప్రతి జీవి ముఖ్యమైనదే అని, వాటిని రక్షించుకునే బాధ్యత మనదే అని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జీవవైవిధ్య దినోత్సవంలో ఆమె అతిథిగా పాల్గొన్నారు. బుధవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సృష్టిలో ఉత్పత్తిదారులు, వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అని మూడు రకాల జీవులు ఉన్నాయన్నారు. ఇవి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతినడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తాయని తెలిపారు. అనంతరం పలువురు చిన్నారులకు కళాకృతులు తయారు చేయటంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు రాజారామ్మోహన్‌రాయ్ జయంతి సందర్భంగా గ్రంథాలయంలో చేసిన ఆయన చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, రచయిత సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



చిన్నారులకు కళాకృతుల తయారీలో శిక్షణ ఇస్తున్న అనసూయాదేవి

జీవవైవిధ్యంతోనే మానవాళి మనుగడ

విశాఖ విద్య : మానవాళి మనుగడకు జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, ప్రముఖ ఉపన్యాసకులు గొట్టేటి రవి అన్నారు. టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ శిక్షణలో భాగంగా బుధవారం వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు ప్రకృతి పరిరక్షణ, దాని వినియోగం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులందరికీ జీవ వైవిధ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ శిక్షణార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన పర్యావర్యణ కార్యకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డోల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న శిక్షణార్థులు, నిర్వాహకులు

ప్రజా భాగస్వామ్యంతోనే జీవ వైవిధ్య పరిరక్షణ

సీతంపేట: జీవ వైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్ అమలుకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవ వైవిధ్య నష్టాన్ని ఆపడానికి కృషి చేయాలని కోరారు. జీవ వైవిధ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని మొదలుపెట్టాలన్నారు. ఏవీఎన్ డిగ్రీ కళాశాల లెక్చరర్ అర్చన మాట్లాడుతూ సముద్రం మన భవిష్యత్ ఆహార కేంద్రమని పేర్కొన్నారు. సముద్ర జీవరాశిని కూడా కాపాడటం మన బాధ్యతన్నారు. విద్యార్థులు జీవ వైవిధ్య పరిరక్షణలో ప్రధాన భూమిక వహించాలని సూచించారు. నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను జీవ వైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. సిఫ్రా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది విద్యార్థులకు గ్రీన్ అంబాసిడర్స్‌గా శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 80 శాతం ప్రజలు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కోసం సంప్రదాయ మొక్కల ఆధారిత మందులపై ఆధారపడుతున్నారన్నారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్, మురళీనగర్ గార్డెనింగ్ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, మళ్ల సరిత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హరి, భాస్కర్, పంతుల లలిత, శివలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ వీసీ సుంకరి రామకృష్ణారావు